ఘనంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు


కీసరలో అంబేడ్కర్ జయంతి వేడుకల్లో..


కీసరలో మేడ్చల్ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్


జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


మేడ్చల్‌లో నివాళులర్పిస్తున్న నేతలు


మున్సిపల్ కార్యాలయంలో


జవహర్‌నగర్‌లో వజ్రేష్‌యాదవ్, మేయర్, డిప్యూటీ మేయర్


పూడూర్‌లో..

మేడ్చల్ జోన్ పరిధిలో అంబేడ్కర్ 133వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలు పార్టీల ప్రజా ప్రతినిధులు, అధికారులు,కాలనీ సంఘాల ప్రతినిధులు భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ చిత్రపటం, విగ్రహాలకు ఆదివారం ఘనంగా నివాళులర్పించారు.

– మేడ్చల్ జోన్ బృందం


బాబాసాహెబ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి


అన్నోజిగూడ రాజీవ్‌గృహకల్పలో మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ప్రసన్నబాబు


పోచారంలో యునైటెడ్ ఎస్సీ సంఘం ఆధ్వర్యంలో..


మేడ్చల్ కలెక్టరేట్‌లో..


రాజబొల్లారంలో నివాళులర్పిస్తున్న నాయకులు


గుండ్లపోచంపల్లిలో..


ఘట్‌కేసర్‌లో చైర్‌పర్సన్ పావనీజంగయ్య తదితరులు

సీఎం రేవంత్‌రెడ్డికి చిత్రపటం బహూకరణ



కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సోమేశ్ సీఎం రేవంత్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సీఎంకు ఆయన చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. మేడ్చల్–మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి గెలుపుకోసం యూత్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కృషిచేయాలని పిలుపునిచ్చారు. దమ్మాయిగూడ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సామలశ్రీనివాస్‌రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి


మాట్లాడుతున్న నక్కా ప్రభాకర్‌గౌడ్

మేడ్చల్‌రూరల్ : మల్కాజిగిరి పార్లమెంట్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని దీనికి ప్రతీ కార్యకర్త పట్టుదలతో కృషి చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నక్కా ప్రభాకర్‌గౌడ్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలో ఆదివారం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎంపీ ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారని కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ గెలుపు కోసం కష్టపడాలని, ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటువేసేలా వారికి హామీలను వివరించాలన్నారు. మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు భేరి ఈశ్వర్, నరేందర్‌రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, రాజేందర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా కార్యకర్తలు పనిచేయాలి...

మేడ్చల్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి గెలుపుకోసం నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా పనిచేయాలని పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించి ఎన్నికల కమిటీని ఏర్పాటుపై ఆయన చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కమిటీని అదిష్టానం ఏర్పాటు చేస్తుందని అన్ని వార్డుల కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి నెలరోజుల పాటు కలిసి పనిచేయాలన్నారు. నాయకులు మల్లేష్‌గౌడ్, రాఘువేందర్‌గౌడ్, కౌన్సిలర్లు చాపరాజు, మణికంఠగౌడ్, నాయకులు రంజిత్, లక్ష్మణ్, నాగభూషణం, యూసుఫ్‌ఖాన్, రాజు, రామస్వామి, రాఘువేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలోకి చేరికలు


బీజేపీలో చేరిన నేతలతో ఈటల రాజేందర్

మేడ్చల్: మండలంలోని రాజబోల్లారం, అక్బర్జాపేట్ గ్రామాలకు చెందిన పలువురు నాయకులు ఆదివారం బీజేపీలో చేరారు. బీజేపీ మల్కాజ్‌గిరి అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్షంలో వారు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మండల బీజేపీ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శామీర్‌పేట్: శామీర్‌పేట మండలానికి చెందిన పలువురు నాయకులు బీజేపీ పార్టీలో చేరారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్షంలో శామీర్‌పేట గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆదివారం బీజేపీలో చేరారు. వీరికి మాజీమంత్రి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మూడేళ్ల కుమార్తెకు గాయాలు

మేడ్చల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి చెందగా.. మూడేళ్ల చిన్నారికి తీవ్రగాయాలైన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం, కళాకల్‌కు చెందిన రామ్ మురాట్ (29), తన మూడేళ్ల కుమార్తెతో కలిసి ద్విచక్ర వాహనంపై మేడ్చల్ కు వచ్చి 44వ జాతీయ రహదారి మీదుగా ఇంటికి తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మేడ్చల్ పరిధిలోని ముబాకర్ హోటల్ వద్దకు రాగానే లారీ అతివేగంగా వచ్చి వీరి వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రామ్ మురాట్ అక్కడికక్కడే మృతిచెందగా.. చిన్నారికి తీవ్రగాయాలయ్యాయి. ఈ మేరకు మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు..


సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ చేరిన కార్పొరేటర్ మెట్టు ఆశాకుమారి


కుమార్‌ముదిరాజ్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 7వ డివిజన్ కార్పొరేటర్ మెట్టు ఆశాకుమారి ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరివర్ధన్‌రెడ్డిల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కార్పొరేటర్ మెట్టు ఆశాకుమారి, మెట్టు వెంకన్న, మెట్టు ప్రణీత్‌కుమార్‌లు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరానన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో 7వ డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు.

హస్తంగూటికి బీఆర్ఎస్ నేతలు..

ఘట్‌కేసర్: బీఆర్ఎస్ వెంకటాపూర్ గ్రామశాఖ అధ్యక్షుడు కుమార్‌ముదిరాజ్, బీఆర్ఎస్ నాయకుడు కీసరగుట్ట మాజీ డైరెక్టర్ నరేశ్‌గౌడ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, బీ– బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

శామీర్‌పేట్ : మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి సమక్షంలో యాడారం గ్రామ మాజీ సర్పంచ్ యాంజాల సుజాతామల్లికార్జున్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు.

కబేళాలకు తరలిస్తున్న పశువుల పట్టివేత

ఘట్‌కేసర్: క్రూరంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని ఘట్‌కేసర్ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఏఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని యంనంపేట్ చౌరస్తాలో తనిఖీలు చేస్తుండగా.. అనుమానాస్పదంగా కనిపించిన (టీఎస్52ఆర్8835) వాహనాన్ని తనిఖీ చేయగా.. 22 పశువులు కనిపించాయి. తరలిస్తున్న వారిని విచారించగా జనగాం జిల్లా నవాబ్‌పేట్ గ్రామంలో కొనుగోలు చేసి నగరంలోని బహదూర్‌పూర కబేళాకు తరలిస్తున్నట్లు తేలింది. నిందితులు డ్రైవర్ రాణా, శిలాంబపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మజ్జిగ వితరణ



కీసర: నాగారం మున్సిపల్ పరిధిలోని సత్యనారాయణ కాలనీ సమీపంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వాహనదారులకు మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, కౌన్సిలర్ బిజ్జశ్రీనివాస్‌గౌడ్‌లు బీజేపీ నేతలతో కలిసి మజ్జిగను పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ సేవలను ఆయన ఈ సందర్భంగా అభినందించారు.

పోచారం: అన్నోజిగూడలోని ఎన్టీపీసీ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకుడు వేమురెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాటసారులకు ఆయన మజ్జిగ పంపిణీ చేశారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రతిఏటా ఎన్టీపీసీ చౌరస్తాలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



మేడ్చల్: నగరంలోని కూకట్‌పల్లిలో నిర్వహించిన కరాటే అండ్ కుంగ్‌ఫూ సౌత్ ఇండియా పోటీల్లో మేడ్చల్‌కు చెందిన 369 కరాటే అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అకాడమీకి చెందిన 15 మంది విద్యార్థులు బంగారు, వెండి పతకాలు సాధించగా.. అకాడమీ ఫౌండర్ చైర్మన్ సాయికుమార్, కోచ్‌లు విద్యార్థులను సన్మానించారు.

పార్టీని వీడిన వారి గురించి ఆలోచించొద్దు

విజయమే లక్ష్యంగా పనిచేయాలి



మేడ్చల్ : అవకాశవాద రాజకీయాలు చేసే నాయకులు ఏ పార్టీల్లో ఉన్నా.. వారు ఏనాటికైనా మోసం చేసేవారని అలాంటి వారి కోసం నిఖార్సైన కార్యకర్తలు పట్టించుకోవద్దని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపుకోసం కలిసికట్టుగా ఉండి పనిచేయాలని మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికానర్సింహ్మారెడ్డి, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్ష కార్యదర్శులు శేఖర్‌గౌడ్, విష్ణుచారీలు అన్నారు. మేడ్చల్‌లోని ఎమ్మెల్యే మల్లారెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పట్టణ బీఆర్ఎస్ నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మేడ్చల్ పట్టణంలో బీఆర్ఎస్ బలంగా ఉందని కొంతమంది నాయకులు పార్టీని వీడినంత మాత్రానా తమకు జరిగే నష్టం ఏమిలేదన్నారు. 10 మంది నాయకులు వెళ్తే వందమంది కార్యకర్తల సంఖ్య పెరుగుతుందన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల నాయకులు కలిసికట్టుగా ఉండి పనిచేయాలన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థికి పట్టణం నుంచి మంచి మెజార్టీ తీసుకొచ్చేలా పనిచేయాలన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ వీరభద్రారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, నాయకులు సందీప్‌గౌడ్, మహేష్, హరికృష్ణ, ఈశ్వరయ్య, మల్లేష్, విజయ్, రవికుమార్, సంజీవరావు, శారద, నీలిమ, పద్మ తదితరులు పాల్గొన్నారు.


అగ్నిమాపక వారోత్సవాలు



శామీర్‌పేట్: వేసవికాలంలో ప్రజలు అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మేడ్చల్ జిల్లా అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ కే.వీ సతీష్‌కుమార్ అన్నారు. ఆదివారం తుర్కపల్లిలోని ఫైర్ స్టేషన్‌లో అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో భాగంగా ప్రాణాలు కోల్పోయిన సిబ్బందికి నివాళులర్పించారు. ఫైర్ స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాల నివారణపై వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

ఓటు నమోదుకు నేడు తుది గడువు!

- మరో అవకాశం కల్పించిన ఎన్నికల సంఘం
- చిరునామాతో సహా మార్పులు చేసుకోవచ్చని స్పష్టీకరణ



సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రజాస్వామ్యానికి ఓటే ఊపిరి. సమర్థ నాయకుడిని ఎన్నుకునేందుకు వజ్రాయుధం వంటి ఓటుహక్కు వినియోగానికి రాజ్యాంగం అవకాశం కల్పించింది. అధికార యంత్రాంగం చైతన్య కార్యక్రమాలు, రాజకీయ పార్టీల పిలుపు, స్వతహాగా సంకల్పం తదితర కారణాలతో పోలింగ్ శాతం క్రమంగా పెరుగుతోంది. ఈ తరుణంలో కీలకమైన ఓటు హక్కు పొందేందుకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. ఇప్పటికే తుది జాబితాను వెలువరించినా.. కొత్త వారికి నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించడం గమనార్హం. ఈనెల 15 వరకు తుదిగడువు విధించారు. కొత్తగా నమోదుతో పాటు, చిరునామా మార్పులకు అవకాశం కల్పించారు.

- మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం దేశంలోనే అతిపెద్ద నియోజకవర్గంగా పేరుంది. ఈ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి.
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలో ఉప్పల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. రంగారెడ్డిజిల్లాలో ఎల్బీనగర్, హైదరాబాద్ జిల్లాలో కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం ఉంది.
- లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడక ముందే ఎన్నికల సంఘం గత ఫిబ్రవరి 8న ఓటర్ల తుది జాబితాను ప్రకటించింది. ప్రస్తుతం ఎన్నికల షెడ్యూల్ వెలువడగా.. ఓటరు నమోదుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఇందులో ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారికే అవకాశం ఇచ్చారు.

తుది అవకాశం..

- కేంద్ర ఎన్నికల సంఘం పార్లమెంట్ ఎన్నికలకు పచ్చజెండా ఊపడంతో హడావుడి మొదలైంది. ఈ మేరకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఓటర్ల నమోదు, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై అధికారులు నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం జాబితాలో కొత్తగా ఓటు నమోదుకు మరో అవకాశం కల్పించింది. ప్రస్తుతం అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటేయాలనే సంకల్పంతో భారత ఎన్నికల కమిషన్ ఈ అవకాశాన్ని కల్పిస్తోంది.

అవగాహన.. చైతన్యం

- ఓటు ప్రాముఖ్యతను జిల్లాల్లో సాంస్కృతిక కళాకారులు అవగాహన కల్పిస్తున్నారు. ప్రత్యేక వాహనం ఏర్పాటు చేయగా.. బస్తీలు, గ్రామాలు, పురపాలక సంఘాల్లోని కూడళ్లు, బస్టాండ్లు, మార్కెట్లు, పట్టణాల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యాసంస్థల్లో కూడా ఓటు నమోదుపై ప్రచారం చేపడుతున్నారు. నూతనంగా ఓటు నమోదుపై అవగాహన కల్పిస్తూనే.. హక్కు పొందేలా ప్రోత్సహిస్తున్నారు.

క్యాంపస్ అంబాసిడర్లు...

- గతనెల 18న ఎన్నికల షెడ్యూల్ వెలువడగా, అప్పటి నుంచి ఓటు నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో క్యాంపస్ అంబాసిడర్లను నియమించారు. వీరంతా ఓటునమోదుపై యువతలో ప్రచారం చేయటంతో పాటు వారి పేర్లు నమోదు చేసుకునేలా దృష్టి సారిస్తున్నారు.
- మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 1,468 దరఖాస్తులు వచ్చాయి.

ఫారం–6: 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదుకు ఈ దరఖాస్తును నింపాలి. ఓటరు హెల్ప్‌లైన్ యాప్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. బూత్ స్థాయి అధికారి (బీఎల్‌ఓ) వద్ద కూడా ఓటు నమోదు దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.

ఫారం–7: ఒకటి కంటే ఎక్కువ స్థానాల్లో ఓటు కలిగి ఉండకూడదు. నివసించని ప్రాంతం నుంచి ఓటు హక్కును తొలగించుకొవటానికి ఈ దరఖాస్తు ఉపయోగపడుతుంది.

ఫారం–8: పేరులో సవరణలు, చిరునామా మార్పు, ఎపిక్ మార్పు, దివ్యాంగులుగా గుర్తింపునకు, ఫోన్ నంబర్ అప్‌డేట్ చేసుకోవటానికి ఈ దరఖాస్తును నింపాలి.